క్లుప్తంగా

ఏకాదశి పూజలు

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో బుధవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట, విజయరామరాజుపేట, రాజాం తదితర గ్రామాల ఆలయాల్లో ఏకాదశి పూజలు చేశారు. వడ్డాది వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు సాయి, రాజా, నాగేశ్వరరావు, రత్నాజీ, ఈశ్వరరావు, ప్రవీణ్, వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ వీరవలి రహదారిలో దొండా శ్రీరామూర్తి వేలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

117 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా ఆనందపురంలో బుధవారం లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ 117 మందికి వైద్య సేవలందించారు. ఆరుగురు గర్భిణులను పరీక్షించి రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



చెల్లయమ్మకు ఆర్థిక సాయం అందించిన ఫ్యాక్టరీ సిబ్బంది

బుచ్చెయ్యపేట: చెరకు మంటల్లో కాలిపోయి మృతి చెందిన రైతు సుంకరి పోతురాజు కుటుంబ సభ్యులకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది తక్షణ సాయం అందించారు. ఈ నెల 17న బుచ్చెయ్యపేటలో పోతురాజు తన పొలంలో చెరకు చెత్తకు నిప్పు పెట్టగా గాలికి మంటలు ఎగిసిపడి అందులో చిక్కుకుని సజీవ దహనమైన విషయం విదితమే. పోతురాజు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతు కావడంతో బుధవారం ఫ్యాక్టరీ సిబ్బంది తక్షణ సాయం కింద మృతుని భార్య చెల్లయమ్మకు రూ.5 వేలు అందించారు. మిగిలిన బీమా నగదు త్వరలోనే అందిస్తామని తెలిపారు.

వైభవంగా రామాలయ ప్రారంభోత్సవం




ఆలయంలో సీతారాములను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

నాతవరం: పి.కె.గూడెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. వేదమంత్రోచ్చారణల నడుమ విగ్రహ ప్రతిష్ట, అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, ఎంపీటీసీ గాడి దేవి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వసంత, ఎ.వరహాలబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు గాడి లచ్చబాబు పాల్గొన్నారు.

నియమావళిని అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు

- చోడవరం ఆర్వో చిన్నికృష్ణ



మాట్లాడుతున్న ఆర్వో చిన్నికృష్ణ

రోలుగుంట: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా అమలు చేయాలని ఎన్నికల సిబ్బందికి చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగు అధికారి, అనకాపల్లి ఆర్డీవో ఎల్.జి. చిన్నికృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఆయన బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, క్లస్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, చీరలు, గిఫ్టులు తదితర ప్రోత్సాహకాల నిల్వలుంటే పోలీసులకు సమాచారం ఇచ్చి నియంత్రించాలన్నారు. నియమావళిని అతిక్రమించే వారెంతటి వారయినా చర్యలు తప్పవన్నారు. ఎస్సై సురేష్, ఈవోపీఆర్డీ నూకరాజు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విశేష కృషితో 11 గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. రూ.6 కోట్లతో చురుగ్గా రోడ్ల పనులు చేస్తున్నారు. ఈ గ్రామాల గిరిజనుల గోడును చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, పలుమార్లు మంత్రిగా పనిచేసిన అయ్యన్న కనీసం అటువైపు చూసిన దాఖలాలు లేవు.

- 11 గిరిజన గ్రామాలకు రోడ్ల సౌకర్యం
- రూ.6 కోట్లతో చురుగ్గా పనులు
- దశాబ్దాల కష్టాలకు చెక్
- చేతులెత్తేసిన సీనియర్ నేత అయ్యన్న
- చేసి చూపించిన ఎమ్మెల్యే గణేష్



గదబపాలెం నుంచి నిమ్మగెడ్డకు రోడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



దొంకాడ గిరిజనుల ఆనందం

గొలుగొండ: మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తుండటంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండలంలో జిల్లెడిపూడి నుంచి దొంకాడ వరకు రోడ్డు లేని దుస్థితి. ఇక్కడ ఆదివాసీలకు రోడ్డు లేక నరకయాతన పడేవారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతం నుంచి కాలినడక బయటకు వచ్చేవారు. వీరంతా అల్లూరి జిల్లా పకలజీడి గ్రామం నుంచి 15 ఏళ్ల క్రితం వచ్చి పోడు భూముల సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి రోడ్డు సౌకర్యం కల్పించడానికి కోటి రూపాయలు మంజూరయ్యాయి. ఇటీవల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కిలోమీటరు పరిధిలో తారు రోడ్డు వేయడం కోసం అధికారులు చర్యలు చేపట్టారు.

నిమ్మగెడ్డ నుంచి గదబపాలెం వరకు

నిమ్మగెడ్డ నుంచి గదబపాలెం గిరిజన గ్రామం వరకు రోడ్డు లేక గదబపాలెం, నిమ్మగెడ్డ, ఎం గదబపాలెం గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వీరికి తారురోడ్డు సౌకర్యం కోసం ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేయగా, ఈ పనులు ప్రస్తుతం 50 శాతం పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తి చేయడం కోసం అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు.. మూడు పంచాయతీలకు మేలు

పీఎస్‌డీ పాలెం నుంచి పప్పుశెట్టిపాలెం వరకు రోడ్డు ఏర్పాటుకు నాలుగు రోజుల క్రితం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు ఆరు కిలోమీటర్ల మేర నిర్మించడం వల్ల పుత్తడిగైరంపేట, ఎస్. కంఠారం, పప్పుశెట్టిపాలెం పంచాయతీ పరిధి అప్పన్నపాలెం, కంఠారం, అడ్డల్లోవ, సుద్దలపాలెం, పెసరాడ, తదితర గిరిజనులకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.4.5 కోట్లు మంజూరు కావడంతో పనులు ప్రారంభం చేస్తున్నారు.

గిరిజనుల్లో ఆనందం

మండలంలో 11 గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను గిరిజనులు కోరారు. దీంతో రూ.6 కోట్లు మంజూరు చేశారు. వీటితో పనులు చేస్తుండటంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూడటం, హామీలు ఇవ్వడం మినహా ఏనాడూ వీరి సమస్యలపై దృష్టి పెట్టలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గణేష్ దృష్టి పెట్టి గిరిజనుల సమస్యలు తీర్చడంతో కృతజ్ఞతలు చెబుతున్నారు.

త్వరితగతిన పనులు

గిరిజన గ్రామాల్లో రోడ్డు వేయడ కోసం చకచకా పనులు చేస్తున్నాం. ఇప్పటికే నిమ్మగెడ్డ పనులు చాలా వరకు పూర్తి చేశాం. రోడ్లు ఏర్పాటుకు నిధులు మంజూరు కావడంతో మిగతా ప్రాంతాల్లో పనులు చేపడతామని ప్రాజెక్టు డీఈఈ ఆర్. సత్యనారాయణ తెలిపారు.

చాలా ఆనందంగా ఉంది



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కోసం రూ.కోటి మంజూరైంది. ఇటీవల శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉంది. రోడ్డు మంజూరుకు కృషి చేసిన స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలకు, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఆదివాసీలమైన మాకు ఇంత మంచి కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉంది

– అప్పారావు, గిరిజనుడు, దొంకాడ గ్రామం

లక్ష్మీనారాయణ కల్యాణోత్సవాలు ప్రారంభం



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 134వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణ తంతు వేదమంత్రాల సాక్షిగా పూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలను ముత్యా రామస్వామి (వైశ్య కుటుంబాలు) ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముత్యాల వారి కుటుంబీకులు సత్యనారాయణ, పెద్దియ్య, నారాయణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దేవీ పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం

రోలుగుంట: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవీ పెద్దింటమ్మ ఉత్సవాలు కుసుర్లపూడిలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వేకువజాము నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చుక్కా సత్తిబాబు, పంచాయతీ పాలక సభ్యులు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దు అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ నెల 24 తేదీ వరకూ ఈ ఉత్సవాలతోపాటు రోజూ మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రిళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజు ఆదివారం వీధుల్లో స్టేజ్ ప్రోగ్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.



అభిషేకాలు చేయించుకుంటున్న భక్తులు

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ శంకుస్థాపన

దేవరాపల్లి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు పాల్గొని భక్తిశ్రద్ధలతో భూమి పూజ చేశారు. జై వాసవి, జైజై వాసవి అంటూ భక్తుల నినాదాలతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు డాక్టరు వరదపు రెడ్డి సింహాచలంనాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలితానాయుడు, సర్పంచ్ సబ్బువరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు తదితర గ్రామ పెద్దలు, ఆర్య వైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.



ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో రమణమ్మ

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- అయ్యన్నకు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సవాల్



నర్సీపట్నం: నియోజకవర్గ అభివృద్ధిపై ఆరుసార్లు మంత్రిగా చేసిన అయ్యన్నపాత్రుడు చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సవాల్ విసిరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడుకు సుదీర్ఘకాలం పాటు ప్రజలు అధికారాన్ని ఇస్తే నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. తనకు ఐదేళ్లు అవకాశం ఇస్తే మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. 2014లో అవకాశం ఇచ్చినప్పటికీ స్వల్ప ఓట్లతో ఓటమి చెందానని, 2019లో అదే ప్రజలు 25 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో 30 వేల మెజార్టీతో గెలుస్తామన్నారు. మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు.

పోస్టల్ బ్యాలెట్లపై శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీమోహన్‌రావు

మాకవరపాలెం: పోస్టల్ బ్యాలెట్లపై సిబ్బందికి బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్లను సేకరించేందుకు 20 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వీరికి బ్యాలెట్ల సేకరణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. వీరంతా నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. డీటీ శంకర్రావు పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

చోడవరం/నర్సీపట్నం/మాడుగుల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులే కీలక పాత్ర వహించనున్నారు. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలుపై తమ విధులు నిర్వర్తించనున్నారు. చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా అనకాపల్లి ఆర్డీవో జీవీ చిన్నికృష్ణ, నర్సీపట్నానికి హెచ్.వి.జయరాం, మాడుగులకు జి.వి. సత్యవాణి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా మండల తహసీల్దార్లు పనిచేస్తున్నారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల విధులు:

వీరు మండలానికి ఒకరు ఉంటారు. వీరి పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అక్కడ ర్యాంపుల ఏర్పాటు, విద్యుద్దీకరణ, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఆయా మండలాల పరిధిలో ఎన్నికల చెక్‌పోస్టులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. ఈవీఎంలు ఏర్పాటుకు అవసరమైన గదులను ముందుగా పరిశీలించాలి. రాజకీయ పార్టీల ప్రచారాలు, బ్యానర్ల ఏర్పాటు, ర్యాలీలు, ఇతర ఫిర్యాదులు పరిశీలించి ఎప్పటికప్పుడు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి. ఎన్నికల కోడ్ ఎక్కడా ఉల్లంఘన కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, బీఎల్‌వోతో సమీక్షలు నిర్వహిస్తుండాలి.

చోడవరం ఆర్వో	జి.వి. చిన్నికృష్ణ	8978281888
మాడుగుల ఆర్వో	జి.వి. సత్యవాణి	9100384699
నర్సీపట్నం ఆర్వో	హెచ్.వి.జయరాం	7993437595

చోడవరం నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల వివరాలు:

మండలం	పేరు	ఫోన్ నంబరు
చోడవరం	వేణుగోపాలరావు	8500525525
బుచ్చెయ్యపేట	శ్రీకాంత్	9441416480
రావికమతం		8500019345
రోలుగుంట	రవిచంద్ర	9550309617
నర్సీపట్నం నియోజకవర్గం..		
నర్సీపట్నం	కె. శ్రీరాములు	9491928651
గొలుగొండ	జి.ప్రకాశ్‌రాజు	9704106957
నాతవరం	ఎన్.రమేష్ కుమార్	9441806338
మాకవరపాలెం	బి.మురళీమోహన్	9573165557
మాడుగుల నియోజకవర్గం		
మాడుగుల	టి. సత్యనారాయణ	8519821156
చీడికాడ	బి.ప్రకాష్‌రావు	8919726971
దేవరాపల్లి	జి.లక్ష్మీనారాయణ	9866217266
కె.కోటపాడు	జె.ఈశ్వరమ్మ	9441287917

రౌడీయిజం చేస్తే ప్రజలే తొక్కేస్తారు



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కుటుంబాలు

- పెదబొడ్డేపల్లిలో ఎమ్మెల్యే గణేష్ ఎన్నికల ప్రచారం

నర్సీపట్నం: రౌడీయిజం చేస్తే ప్రజలు తొక్కేస్తారన్న విషయాన్ని అయ్యన్నపాత్రుడు, ఆయన కొడుకు విజయ్ తెలుసుకోవాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. పెదబొడ్డేపల్లిలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంని పొట్టోడని విమర్శలు చేసిన అయ్యన్నపాత్రుడు ఇంట్లో ఒక మరుగుజ్జు ఉన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రతి దఫా ఇవే తనకు చివరి ఎన్నికలంటూ ఓటర్ల వద్ద ప్రాధేయపడటం పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. సానుభూతి కోసం 2019లోనూ ఇవే చివరి ఎన్నికలని వేడుకుంటే ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. వయసు పైబడే కొద్దీ అయ్యన్నకు మతిమరుపు ఎక్కువైందన్నారు. ఒకసారి 67 ఏళ్లు అంటాడు.. ఇంకోసారి 167 ఏళ్లు అంటున్నాడని, ఏమి మాట్లాడుతున్నాడో తెలియని పరిస్థితుల్లో ఉన్నాడని ఆక్షేపించారు. గ్రామాల్లోకి ఏటా పిట్టలదొర వస్తుంటాడు, ఏకధాటిగా మాట్లాడతాడు, అతడెవరో కాదు అయ్యన్నపాత్రుడు కొడుకు విజయ్ అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. పిట్టలదొర మాదిరిగా ప్రతి ఐదేళ్లకోకసారి ఎన్నికల ప్రచారంలోకి వస్తాడు, ఏవేవో చెప్తాడు, ఎన్నికల తర్వాత ఎక్కడికో పోయి వ్యాపారులు చేసుకుంటాడు, వయసుపైబడిన అయ్యన్నపాత్రుడు, పిట్టల దొర విజయ్ ప్రజలకు సేవ చేయడానికి రాలేదని ధ్వజమెత్తారు. వారి అబద్ధాలు నమ్మవద్దు హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో శాశ్వతంగా ఇంటికి సాగనంపాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ వార్డుకు ఏమి చేశావని..ఏ మొహం పెట్టుకోని వచ్చావని అయ్యన్నపాత్రుడిని నిలదీశారు. కనీస సౌకర్యాలు లేని కాలనీకి ఎమ్మెల్యే గణేష్ కోటి రూపాయలతో వార్డును అభివృద్ధి చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 15 టీడీపీ కుటుంబాలు...

రెండు రోజుల క్రితం టీడీపీలో చేరిన ఇనపసప్పల సత్య, కాళ్ల సత్యవతితోపాటు 13 కుటుంబాలు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, కౌన్సిలర్లు బేతిరెడ్డి రత్నం, జగదీశ్వరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నంత కాలం అప్రమత్తం

నాతవరం: ఎన్నికలు కోడ్ ముగిసేంత వరకు సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. డి.యర్రవరం, గుమ్మడిగొండ సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల కటౌట్లు, హోర్డింగులు, ప్రచారాలు చేయొద్దన్నారు. ఎన్నికల ముగిసేంత వరకు అనుమతులు లేకుండా సిబ్బంది గైర్హాజరు కాకుండా ఉండాలన్నారు.



డి.యర్రవరంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్టు

చోడవరం రూరల్: అక్రమంగా పెద్ద ఎత్తున మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ తమ సిబ్బందితో గజపతినగరం జంక్షన్ వద్ద సోదా చేయగా అదే గ్రామానికి చెందిన రాపేటి సుబ్రహ్మణ్యం (62) అనే వ్యక్తి వద్ద 42 మద్యం సీసాలు లభ్యమైనట్టు సీఐ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

మాడుగుల: పొంగలిపాకలో బుధవారం మెగా నేత్ర వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు 63 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 23 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి నరాలు, కంటి నీటి కాసులు, కంటి రెప్పలు, చిన్న పిల్లల కంటి చికిత్సల కోసం ఒక్కొక్కరిని ప్రత్యేకంగా ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ క్యాంపు డిప్యూటీ మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అకాల వర్షం.. రైతుల హర్షం

- రావికమతంలో ఈదురు గాలులు
- రోడ్లపై చేరిన వర్షపునీరు

రావికమతం/ బుచ్చెయ్యపేట /కె.కోటపాడు/ మాకవరపాలెం/నాతవరం/చీడికాడ/మాడుగుల రూరల్/రోలుగుంట: నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బుధవారం మధ్యాహ్నం వరకూ ఎండ కాసి ఆపై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించినా నిన్నటి వరకూ ఆ ఛాయలేవీ కనిపించక పోవడంతో రైతులు ఉసూరుమన్నారు. తాజాగా భారీ వర్షమే కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పచ్చిక వస్తుందని పాడి పశువులకు బాగా మేలు చేస్తుందన్నారు. జీడి, మామిడి తోటలకు ఎంతో మేలు చేసిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు చేసేందుకు కొంతమేర ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. చల్లని గాలులతో ప్రజలు సేద తీరారు. రావికమతం మండలం కొత్తకోట మెయిన్ రోడ్డులో డ్రైనేజీ పూడికపోవడంతో కోటవీధి రామాలయంలోకి, సమీప ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. బుచ్చెయ్యపేటలో గాలీ వర్షం కురిసింది. వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మాడుగుల మండలంలో పక్వానికి వచ్చిన మినప, పెసర, పిల్లి పెసర పంటలకు నష్టం వాటిల్లింది. పొలాల్లో వదిలేసిన మినప చేను పూర్తిగా తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు చింతచెట్ల నుంచి బొట్టలు పూర్తిగా రాలిపోయాయి.



వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో కురుస్తున్న వర్షం



కొత్తకోటలో కురుస్తున్న భారీ వర్షం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం



చౌడువాడలో కురుస్తున్న వర్షం

రోలుగుంట ఇన్‌చార్జి ఎంపీడీవోగా జాన్ లింకన్

రోలుగుంట: వ్యక్తిగత సమస్యలపై దీర్ఘకాలిక సెలవుపై స్థానిక ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు వెళ్లారు. ఆయన స్థానంలో సార్వత్రిక ఎన్నికలకు అంతరాయం కలగకుండా ఉన్నతాధికారులు నర్సీపట్నం ఎంపీడీవో కె.జాన్ లింకన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.